


# కథ లోపలి కదలిక తెలిసినవాడే కథకుడు

**- ఇంద్రగంటి శ్రీకాంతశర్మ**

కవిగా, కథకుడిగా, నవలా రచయితగా, సాహిత్య విమర్శకుడిగా, ఆకాశవాణి ప్రయోక్తగా ఇంద్రగంటి శ్రీకాంత శర్మను తెలియని వారు లేరు. సాహితీవేత్తలందరికీ ఆయన ఆత్మీయ మిత్రుడు. ఎల్లవేళలా సాహిత్యాన్నీ, స్నేహాన్ని కావాలనుకునే మనిషి. 'సృష్టిలో తీయనిది స్నేహమేనోయి' అన్న తండ్రి మాటను అక్షరాల పాటించే వ్యక్తి. వారితో ఇంటర్వ్యూ ఈవారం మీకోసం...



ఆరుద్రతో....

## విద్యాభ్యాసం

నేను 29మే 1944లో రామచంద్రాపురంలో పుట్టాను. మా నాన్నగారు పేరు ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి. మా అమ్మ పేరు వెంకటరత్నమ్మ. ఎస్.ఎస్. ఎల్.సి వరకు నేను రామచంద్రాపురంలోనే చదువుకున్నాను. తర్వాత కాకినాడ పి.ఆర్. కాలేజీలో పియుసి చదివి ఆ తర్వాత కొవ్వూరులో భాషాప్రవీణ చేశాను.

## కథలు రాయాలనిపించింది

మా ఇంట్లో పెద్ద లైబ్రరీ ఉండేది. మా నాన్నగారిదా లైబ్రరీ. 1931 నుంచి 'భారతి' సంచికలు బౌండ్స్‌గా143 ఉండేవక్కడ. అవేకాదు, ప్రతిభ, ఉదయిని, ఆంధ్రశిల్పి, కిన్నెర, ఆంధ్ర, ప్రబుద్ధాంధ్ర...చాలా పత్రికలుండేవి. అప్పుడే చలం, శ్రీపాద సాహిత్యాన్ని బాగా చదువుకున్నాను. పదమూడేళ్ళ వయసు నుంచే కథలు చదవడం అలవాటయింది. ఒక పక్క ఇలా కథలు చదవడం, మరో పక్క నాన్నగారితో పాటు సాహిత్య సభలకు వెళ్ళడం, అక్కడ ప్రముఖ రచయితలను కలవడం...దానాదీనా నాక్కూడా కథలు రాయాలనిపించింది.

## పెళ్ళి చేసుకుందామనుకున్నాను.

కథలు రాస్తే ఓ చలంలాగానో, బుచ్చిబాబులాగానో రాయాలనుకునే వాణ్ణి. ఎందుకలా రాయాలనిపించేదంటే...చలం అంటే పిచ్చిప్రేమ. బుచ్చిబాబంటే వెర్రి. ఎంత వెర్రి అంటే...బుచ్చిబాబు 'చివరకు మిగిలేది' నవల చదివి, ఆ నవలలోని 'కోమలి' వంటి అమ్మాయి దొరికితే అమ్మానాన్నలకు చెప్పా పెట్టకుండా పెళ్ళి చేసుకుందామనుకునే వాణ్ణి. ఆ మహారచయితల రచనా శిల్పాలు అలాంటివి! ఇంకో మాట చెప్పాలి. చలం, బుచ్చిబాబుల్ని చదువుతున్న రోజుల్లో కథలు తప్ప, కవిత్వం రాయాలని నాకెప్పుడూ అనిపించలేదు.

## నువ్వు నువ్వులా రాయి!

1961లో అనుకుంటాను. 'ఆమె నవ్వింది' అని స్కెచ్ రాశాను. దానిని చలంగారికి పంపించాను. ఆయనకది నచ్చి, దానిని కె.సభాగారి సంపాదకత్వంలో వెలువడుతున్న 'దేవదత్తం'లో ప్రచురింపజేశారు. 1962లో అనుకుంటాను...'పగిలిన గుండె' అని నా మొదటి కథ ఆంధ్రపత్రికలో అచ్చయింది. తర్వాత 'తెరలు' అని కథ రాశాను. రాసిన తర్వాత మనకిక తిరుగులేదనుకుని 'మా కథనొకసారి చూడొండోచ్' అన్న లెవల్‌లో దాన్ని నాన్నగారికి చూపించాను. ఓపిగ్గా చదివారాయన. చదివి–


'నువ్వు చలంలాగానో, బుచ్చిబాబులాగానో కథలు రాయాలనుకోకు! వాళ్ళ ప్రభావంలో కొట్టుకునిపోకు! నువ్వు నువ్వులా కథలు రాయి! బాగుంటుంది' అన్నారు. ఆ మాటలు చాలా రోజులక్కాని నాకు అర్థం కాలేదు. అర్థం అయిన నాటికి నేను తెలుగు–సంస్కృత సాహిత్యాలు రెండూ బాగా చదువుకున్నాను. పాశ్చాత్య సాహిత్యాన్ని పెద్దగా అప్పట్లో నేను చదువుకోలేదు. చదువుకోకపోయినా నా జీవన విధానం, జీవితం పట్ల నా అభిరుచి చాలా అధునాతనంగా ఉండేవి. అలా ఉండడానికి కారణం ఉంది. ఆధునిక జీవితం మీదా, ఆధునిక సాహిత్యం మీద నాన్నగారికి బాగా మక్కువ ఉండేది. వారి ప్రభావమే నా మీదా ఉండేది. అదలా ఉండగా 1967 వరకు నేను కథలు మాత్రమే రాస్తూ వచ్చాను. తర్వాత ఎందుకో ఆపేశాను. 2004 వరకు కథ అన్నదే రాయలేదు.

## అక్కడ ఉండడమే పెద్ద ఎడ్యుకేషన్

1963లో కవి దేవరకొండ బాలగంగాధర తిలక్‌తో పరిచయ భాగ్యం కలిగింది. ఆయన పరిచయంతో కథంటే ఏమిటి? కవితంటే ఏమిటి? పద్యం అంటే ఏమిటి...ఇవన్నీ తెలుసుకోగలిగాను. మాత్రా ఛందస్సులో గేయాలు రాశాను. గేయాల సంగతి అటుంచితే...కవిత్వంలో 'ఫీల్' అన్నది తిలక్ నేర్పితేనే నేర్చుకున్నాను. తర్వాత ఆంధ్రజ్యోతి వీక్లిలో ఉప సంపాదకునిగా చేరాను. ఆ చేరిక నాలో పెనుమార్పులకు కారణమయింది. ఆనాటి వీక్లి ఎడిటర్ పురాణం సుబ్రహ్మణ్య శర్మగారు ఓ రోగికి డాక్టర్ ప్రిస్క్రిప్షన్ రాసిచ్చినట్టుగా నాకు...నేనేం పుస్తకాలు చదవాలో పెద్ద లిస్టు రాసిచ్చారు. ఆ లిస్టులోని పుస్తకాలన్నీ చదివాను. చదివిన తర్వాత నాకు 'లెఫ్టిస్ట్ లిటరేచర్' అంటే ఏంటో తెలిసింది. అప్పుడు ఆంధ్రజ్యోతి వీక్లి విజయవాడలో ఉండేది కదా! విజయవాడలో ఉండడమే పెద్ద ఎడ్యుకేషన్‌గా ఫీలయ్యే వాణ్ణి. పత్రికాఫీసులు, రేడియో, పుస్తక ప్రచురణ సంస్థలు...విజయవాడ అద్భుతంగా ఉండేది. అప్పుడే పాశ్చాత్య సాహిత్యాన్ని బాగా చదువుకున్నాను. మామ్‌ను చదివాను.ఆస్కార్ వైల్డ్‌ని చదివాను. ఇంకా చాలామందిని చదువుకున్నాను.

## ఆ రోజులే వేరు!

పుస్తకాల లిస్ట్ రాసివ్వడమే కాదు, గొప్ప గొప్ప కథలు కూడా పురాణం గారు నాకు చెప్పేవారు. 'మై లిటిల్ వైఫ్' అని ఓ అమెరికన్ కథను చదివి, ఆ కథను రాత్రి భార్య సీతగారికి చెప్పి ఓదార్పు పొందుదామనుకుంటే...ఆవిడ నిద్రపోవడంతో



పండిట్ రవిశంకర్ తదితరులతో..

## నచ్చినవి

కథ : ఫిషర్ మేన్ అండ్ హిజ్ సోల్ (ఆస్కార్ వైల్డ్)
రచయితలు : చలం, బుచ్చిబాబు
కవి : కృష్ణశాస్త్రి
నవలా రచయిత : శ్రీపాద
గాయకుడు : కిషోర్ కుమార్
గాయని : లతామంగేష్కర్
నటుడు : అల్ పచినో (హాలీవుడ్ నటుడు)
నటి : మీనాకుమారి
మిత్రుడు : నండూరి రామమోహనరావు
కూర : పనసపొట్టు
ఊరు : రాజమండ్రి




చెప్పలేకపోయానని, ఆ కథను నాకు చెప్పి కళ్ళు చెమర్చుకున్నారు పురాణం. కాస్సేపటికి-

'గుండె బరువు తీరిందయ్యా! నీకీ కథ చెప్పడంతో నన్ను నేను ఓదార్చుకున్నాను' అన్నారు. ఇది ఎందుకు చెప్పేనంటే...గొప్ప కథను చదివితే గుండెల్లో దాచుకోవడం కాదు, పదిమందికీ చెప్పాలనుకునేవారు ఆనాటి రచయితలు. అలాగే పుస్తకాలు కూడా. ఒకరితో ఆ పుస్తకం ఆగిపోకూడదు. పదిమందీ చదవాలంటూ పంపిణీ చేసేవారు. ఆ రోజులే వేరు!

### పెద్ద ఉదాహరణ

కథలు చెప్పి, పుస్తకాలు చదివించి మనుషుల్ని మార్చడమే కాదు, బాధ్యతలు-బంధాలు తెలియజేసి వ్యక్తిత్వాలు కూడా మార్చగలిగేవారు ఆనాటి రచయితలు. అందుకు నేనే పెద్ద ఉదాహరణ. నా జీవితంలో చాలా అరాచకం ఉండేది. దాన్ని నిరోధించి నా వ్యక్తిత్వాన్ని మార్చారు నండూరి రామమోహనరావు గారు. నాకు క్రమశిక్షణను అలవాటు చేసిందాయనే!

### కథ ఎలా ఉండాలంటే...

ఎడ్యుకేషన్ అంటే ఎకడమిక్ క్వాలిఫికేషన్ కానే కాదు, అలాగే 'క్రియేటివిటీ' అంటే డిగ్రీ కాదు. ఈ రెండూ స్పష్టంగా తెలిస్తేనే రచయితలు రాణిస్తారు. 'నువ్వు చదువుని నేర్పగలవుకాని, నేర్పేందుకు అవకాశం లేని విషయాలు ఈ ప్రపంచంలో చాలా ఉన్నాయి' అంటాడు ఆస్కార్ వైల్డ్. ఇప్పుడు ఇది ఎందుకు చెప్పానంటే...క్రియేటివిటి నేర్పేందుకు, నేర్పడానికి అవకాశం లేని విషయం. దీన్ని గుర్తించాలి. అలాగే తను ఏ ప్రక్రియలో ఇరుక్కోవాలో వస్తువుకే తెలుస్తుంది. దీనిని రచయిత ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి. ఇవన్నీ తిలక్‌గారు చెప్పేవారు. ఇదంతా తెలుసుకుంటేనే కథలు రాయగలం. గొప్ప కథలో ప్రతిభ అనేది బంతిలో జెర్రిలాంటిదట! బంతిలో జెర్రి కదలిక తెలుస్తుంది కాని, బంతిలోకి జెర్రి ఎలా వెళ్ళిందో తెలుసుకోలేం. అలాగే కథ లోపలి కదలిక కూడా అనేవారు పాలగుమ్మి పద్మరాజుగారు. కథ రాస్తే అలా రాయాలనేవారాయన. ఆధునిక తెలుగు కథ కథాలక్షణాన్ని, సరయిన కథనాన్ని ఇంకా సంతరించుకోవాలి. ఈ విషయాలన్నీ తెలుసుకోవాలంటే విస్తృత అధ్యయనం అవసరం. ఈ అవసరాన్ని నేటి తరం రచయితలు గుర్తించాలని నా మనవి.

### కథలే రాస్తాను

ఏం చెయ్యాలో ఆలోచింపజేసేది కథ. జీవితాన్ని ప్రతిబింబించేది కథ. కథకున్న విస్తృతి అలాంటిది. వేగవంతమయిన ఈ జీవితానికి కథే సరయినది. సాహితీ ప్రక్రియలన్నిటా కథే జీవితానికి దగ్గరగా ఉందనిపిస్తోంది. అందుకని ఇక మీదట నేను కథలే రాయాలనుకుంటున్నాను. కవిత్వం రాయాలనిపించడం లేదు.

-జె.ఎస్.

## ఫెంగ్ షుయి



## కలసి తింటే కలదు సుఖం

'కలసి ఉంటే కలదు సుఖం' అన్నాడో కవి. అలాగే కలసి తింటే కూడా సుఖం ఉంటుంది! ఆశ్చర్యంగా ఉందా, నిజం! మనం ఇప్పుడు పరుగుల యుగంలో ఉన్నాం. ముఖ్యంగా నగరాల్లో అయితే రాత్రి పూట పడుకున్న సమయం తప్ప మిగిలిన సమయమంతా పరుగులే! భార్యాభర్త ఇద్దరూ ఉద్యోగాలు చేస్తుంటారు. పిల్లలుంటే వారు స్కూళ్ళకో, కాలేజీలకో పోతుంటారు. ఒక్కొక్కరు ఒక్కో సమయంలో బయలుదేరుతుంటారు. ఒక్కో దిశలో వెళుతుంటారు. ఎవరి హడావుడిలో వాళ్లుంటారు. కలసి తినడమే కాదు, కనీసం కలసి మాట్లాడుకునే సమయం కూడా వారి మధ్య ఉండదు. పరుగులు..పరుగులే! కుటుంబ సభ్యులు తమ భావాలను, బాధలను, ఆలోచనలను, అభిప్రాయాలను ఒకరితో ఒకరు పంచుకోకపోతే ఎలా ఉంటారు? ఆ కుటుంబం ఎలా ఉంటుంది? సంపద ఉన్నా స్పర్ధలతో ఉంటుంది. ఒకరిపట్ల ఒకరికి అవగాహన ఉండదు. ఎవరేం చేస్తున్నారో తెలీకుండా, నాలుగ్గదుల మధ్య అపరిచితుల్లా ఉంటారు. ఇది ఉద్యోగ జీవితంపైనా, చదువులపైన తీవ్ర చెడు ప్రభావాన్ని చూపుతుంది. దీనినుంచి తప్పించుకోవాలంటే కుటుంబ సభ్యులందరూ రోజులో ఒక్కపూటైనా కలసి భోజనం చేయాలి. కలసి భోంచేసినపుడు వారి మధ్య తప్పకుండా మాటలు దొర్లుతాయి. తామేం చేస్తున్నారో, ఎలా చదువుతున్నారో, తమను ఎవరు ఎలా ట్రీట్ చేస్తున్నారో.. ఇలా రకరకాల సమస్యలు, అభిప్రాయాలను ఒకరితో ఒకరు పంచుకుంటారు. ఇలా పంచుకోవడం వలన సమస్యలుంటే గుండె భారం తగ్గుతుంది. కుటుంబ సభ్యులందరూ వినడం వలన, అందరూ కలసి ఆలోచించడం వలన ఆ సమస్యకు పరిష్కారం కూడా దొరుకుతుంది. దీంతో ఆకుటుంబంలో సంతోషం వెల్లివిరుస్తుంది. కాబట్టి, మీరెంత బిజీ మనుషులైనా సరే, రోజులో ఒక్కసారైనా కుటుంబ సభ్యులందరూ కలసి భోంచేయండి. ఆనందాన్ని ఆస్వాదించండి.

*

వారం వారం 'ఫెంగ్ షుయి' మీకోసం

నాకు నచ్చిన నా కథ

# దివసం

- ఇంద్రగంటి శ్రీకాంతశర్మ

భార్య చనిపోతే-
కొడుకు కర్మ చేయాలి.
కొడుకేమిటి? అసలు పిల్లలే లేరు-
ఆకెళ్ల కిష్టప్పకి తప్పలేదు.
బ్రాహ్మడు చెప్పే మంత్రాలు వింటూ పని జరిపిస్తున్నాడు -
వైదిక బ్రాహ్మణ పుట్టుక మరీ!
ఆ మంత్రాలర్థమవుతాయి.
''మానసికంగాగాని, దైహికంగాగాని, ఈమె వ్యభిచ రించి వున్నట్టయితే - ఆ పాప పరిహారం అగుగాక!''-
కిష్టప్ప మనస్సు ఉద్వేగం పొందింది.



''ఇదొకటా? - నేనెందుకు ప్రార్థించాలి?''

''భార్య కదా - నువ్వే భరించాలి - బాధ్యత నీదే!'' అని ఎవరో పొడిచినట్టు అనిపించింది.

ఈ స్వరాజ్యం, భార్య కానేల?

తనలో అనుమానపు చిచ్చుపెట్టనేల?

అది 'చెడి'ందని తేలిపోతే - అదో పద్ధతి - తేలలేదే! - పూర్తి నమ్మకం కలగదు; పోదు!

భగవంతుడు స్త్రీ సంపర్కంలో ఇంతటి కిటుకు పెట్టనేల?

***

డబ్బు సంపాదించి చూపించలేని భర్తని ఏ భార్యా భరించలేదు. ఆమెకు నలుగురిలో అవమానం. పెద్దవాళ్లు అన్నీ చూసే చేశామని సమర్థించు కుంటారు గాని, మూడు వంతుల పెళ్లిళ్లు వినికిడి మీద, నమ్మకం మీద జరిగేవే!

స్వరాజ్యం పెళ్లి ఆకెళ్ల కిష్టప్పతో జరిగిందలాగే-

పెళ్లినాటికి బొంబాయిలో ఉద్యోగం చేస్తున్నాడనీ, నెలకు పదహారు వందలు జీతమని మభ్యపెట్టారు. డిగ్రీ ''వరకూ'' చదివాడన్నారు.

అంతా హుళక్కే-

ఇంటరు మూడో ఛాన్సులో పాసయ్యాడు. నాటకాల రాయుడు. నాటకాల పేరు చెప్పి చీటికి మాటికీ డ్యూటీ ఎగేస్తే ఎవరు సహిస్తారు? - ఆ ఉద్యోగం పోయింది.

పైగా - పెళ్లయ్యాక మన ప్రాంతానికి వచ్చేస్తాడని బోడి హామీ ఒకటి!

సంగతంతా బయటపడ్డాక రెండు కుటుంబాల మధ్య యుద్ధాలై పోయాయి.

ఏమనుకుని ఏమి లాభం? స్వరాజ్యం తండ్రి కోపం దిగమింగుకుని తన ప్లీడరీ గుమస్తా లౌక్యం అంతా ఉపయోగించి - బెజవాడలో ఒక మార్వాడీ పేపరు మార్టు కంపెనీలో ఆకెళ్ల కిష్టప్పకి ఉద్యోగం ''ఇప్పించు కున్నాడు''.

అప్పుడు స్వరాజ్యం ఏలూరు విడిచి కాపరానికి రావలసి

వచ్చింది.

***

దహనం పూర్తయింది.

ఆకెళ్ళ కిష్టప్ప తదేకంగా మంటల్లోకి చూస్తూ నిలబడ్డాడు.

పునిస్త్రీ చావు పుణ్యమన్నారు. ఈ పాపాత్మురాలికీ పుణ్యం ఏమిటి?

ఆకెళ్ల కిష్టప్పని దొలిచేస్తున్న ప్రశ్న ఇది---

***

బెజవాడలో జీవితం మూడు పువ్వులు ఆరు కాయలుగా అనిపించిందతనికి-

ఉదయం తొమ్మిదింటినించి రాత్రి ఎనిమిదింటి దాకా ఉద్యోగం - ఆ పైని కౌతావారి సత్రంలో నాటకాల రిహార్సల్సు - రాత్రి ఏ ఒంటిగంటకో ఇంటికి-

నాటకాలు ఒక వ్యసనం, నటుడనిపించుకొని - పరిషత్తుల్లో బహుమతులు పొందడం ఒక మత్తు.


ఆ మత్తులో సుఖాన్ని గొప్పగా అనుభవించాడు ఆకెళ్ల కిష్టప్ప.

భార్యవిషయంలో - ఏమాట కామాట చెప్పుకోవాలి - చాలా ఉదారంగా ఉన్నాడు. కొంతలో కొంత, - తనవాళ్లు, తనింట్లో, పెళ్లికాని తన శ్రేయస్సు కోసం, అబద్ధాలాడి స్వరాజ్యం పుట్టింటి వాళ్లని మోసగించారనే న్యూనతాభావం అతన్ని బాధించేది.

అందుకే బెజవాడలో ఉండగా ఏమికావాలంటే అది కొనిచ్చాడు. చిన్న జీతంలో చిన్నఅద్దె ఇంటి వాటాలో కాపరం తప్పదు కద! ఇంట్లో కావలసిన ''ఆధునిక'' సామగ్రి అమరదు కద! పండుగలు, పబ్బాలు, నోములు, వ్రతాలు, విహార యాత్రలు, సక్రమంగా సాగవు కద!-

ఈ ''కదా''లకు, సర్దుకుపోవడాలకు అంతం లేదు కద! - అసలైన ఆడంగుల ముచ్చట! నచ్చిన చీరలు కలల్లోనే మిగిలిపోవాలి కద!

స్వరాజ్యం పెద్దగా చదువుకోలేదు. అయిదో ఫారంతో చదువు మరి ముందుకు నడవక పోవడం వల్ల హిందీ 'రాష్ట్ర' పరీక్ష పాసైంది.



ఇంట్లో ఏ కాలక్షేపమూ లేదు. ఆకెళ్ల కిష్టప్ప ఆగమ్మ కాకిలాగ ఇల్లు పట్టక నాటకాల మహోత్సాహంలో పడి వుండేవాడు. దీనికితోడు స్వరాజ్యానికి చిన్నప్పటి నుంచి కలలెక్కువ - అందం అంతం మాత్రం అనడం కంటే - యౌవనం మెరుపుతో ఆ మాత్రం అందంగా అనిపించని ఆడ పిల్లలుండ రనడం సబబు!

***

భార్యపోయిన మూడు రోజులు గడిచి, చితి చల్లబడిన మీదట బ్రాహ్మడు అస్థి సంచయనం చేయించి - కృష్ణానదిలో కలిపించాడు-

ఆకెళ్ల కిష్టప్ప మనస్సు ఇంకా తేరుకోలేదు - దాని వ్యభిచార దోషానికి తనెందుకు పరిహారం కోరాలి? - అనే ప్రశ్న పీకేస్తోంది. ఎవడికి చెప్పుకుంటాడు?

***

... స్వరాజ్యం, మధ్యాహ్నం పూట ఆడించే సినిమాల వైపు మళ్లింది -

సినిమాలు చూడడం వ్యసనమే అయిపోయింది. మరొకరిని పిలిస్తే తనే టిక్కెట్టు తియ్యవలసి వస్తుందని ఒక్కర్తే వెళ్తూండేది-

అటువంటి ఒక సందర్భంలో అనుకోకుండా ఆకెళ్ల కిష్టప్ప కళ్ల బడింది. అది కూడా - ఒక చలాకీ కుర్రాడెవడో టిక్కెట్టు తెచ్చి ఇస్తున్న సమయంలో-

ఇంటికి వచ్చాక పెద్ద యుద్ధమైపోయింది. 'ఇలా ఎన్నాళ్ల నించి సాగుతోం'దని నిలదీశాడు.

స్వరాజ్యం అంతకంటే రెచ్చిపోయి తన దురదృష్టం గురించీ, కనీసం సినిమా చూసే భాగ్యం కూడా ప్రశ్నలకు గురి కావడం గురించీ దులిపి పారేసింది. తనని వంటరి దాన్ని చేసి హింసించడం మానుకోమని హెచ్చరించింది.

ఆకెళ్ల కిష్టప్ప కాస్త వెనక్కి తగ్గాడు. స్వరాజ్యానికి వట్టి ఇంటి అవసరాలకు మించి డబ్బివ్వడం మానేశాడు. స్వరాజ్యం అందులోనే పింగించి - ఒకటో రెండో సినిమాలకి వెడుతూనే వుంది.

ఒకసారి ఇంట్లో కూరలూ, నిత్యావసరాలూ సరిగ్గా చూడడం లేదని ఇష్టం వచ్చినట్లు కిష్టప్ప మాట్లాడితే - అన్నిటి ఖరీదులూ పెరిగాయనీ, నాటకాల పోకిళ్లు మానేసి, సంపాదన గురించి శ్రద్ధ చెయ్యమనీ, వాదించింది. సహనం కోల్పోయి స్వరాజ్యాన్ని మీద పడి కొట్టేసి - ''రంకు ముండకి సంసారం ఎలా రుచిస్తుందీ?'' అంటూ ఒక అసందర్భ ప్రేలాపనతో ఇంట్లోంచి బయటకు వెళ్లిపోయాడు.

కిష్టప్పకి తెలుసు, అలా అంటే, ఆడమనిషి కుంగిపోతుందని -

స్వరాజ్యానికి దుఃఖం వచ్చింది. తనని మోసంతో పెళ్లాడడమే కాక, నోటికి వచ్చినట్టు మాట్లాడిన మూర్ఖుడని అసహ్యించుకుంది.

అయినా - పెళ్లి పవిత్రబంధమాయె! ఎలా తెంచుకుపోవడం? తన తల్లి, అమ్మమ్మ, మామ్మ, అంతా నిప్పులు కడిగి నీళ్ళు తాగిన వాళ్లు. ''నలభై ఏళ్లు దాటేవరకూ తైతక్కలాడినా, మనం ఓర్చుకోవాలి. ఆ పైన మన యిష్టం. పిల్లాజెల్లా కలిగితే పొగరు దిగిపోతుంది'' - అని సంప్రదాయ సిద్ధాంతం.

స్వరాజ్యం ఓర్చుకోవడానికే సిద్ధపడింది. అదనంగా సంపాదన కోసం ఆ కాలనీలాంటి వీధిలో కుర్రాళ్లకి హిందీ పాఠాలు చెప్పడం ప్రారంభించిది.

అప్పట్లో సంపాదనకు సంతోషించినా, కిష్టప్ప మగబుద్ధికి, స్వరాజ్యం శీల పరిరక్షణ ముఖ్యమైపోయింది. అప్పట్లో, కాలేజీ డిగ్రీ కుర్రాడు - అచ్యుతం - 'అక్కయ్య గారూ' అంటూ ఇంట్లో చనువుగా తిరగడం, ఆమె ఇతనితో కారమ్స్ ఆడడం గమనించాడు. సినిమాలకి వెళ్లి

నట్టు కూడా గూఢ చర్యం నడిపి సమాచారం సంపాదించాడు. ఇది హిందీ పాఠాలు చెపు తోందా లేక ఈ పేరిట వేరే కథలు నడుపుతోందా? అనే అనుమానం ప్రబలిపోయింది.

నానా మాటలూ అని – అచ్యుతాన్ని తరిమేసి – స్వరాజ్యాన్ని కొట్టి, కట్టడి చేసి బాధించాడు. పైగా స్త్రీకి సంసారం విడిచి ప్రవర్తిస్తే నరక ప్రాప్తి తప్పదని హెచ్చరిం చాడు.

హెచ్చరించాడు గాని – స్వరాజ్యం మంచితనం, అసహన కారణాలు, కిష్టప్పకి బాగా తెలుసు. బిగించి పట్టి – తను లేకపోతే గతిలేదనే బెదురు కలిగించాలని – తహ తహ! – తనతో ఆర్థికంగా వుండే అసహనం వల్ల, ఎవడితో లేచిపోతుందోనని నిరంతరం అనుమానం –

స్వరాజ్యానికి కిష్టప్పతో బతకడమంటే ఆవిరి పట్టేసిన ఇంట్లో ఊపిరి సలపని విధంగా తయారైంది. ఈసారి కారణం చిన్నదే. పెద్దమావయ్య కూతురూ, అల్లుడు అమెరికా నించి వస్తూ స్వరాజ్యానికి అందమైన ఊలు స్వెట్టరు తెచ్చారు. వాళ్లు వచ్చారని – వాళ్ళ తాహతుకు తగ్గట్టు అతిథ్యం ఇవ్వాలని, స్వరాజ్యం తాప త్రయ పడింది.

వాళ్ళటు వెళ్ళగానే నానాగొడవచేసి – ఊలుస్వెట్టరు వీధిలోకి విసిరేశాడు కిష్టప్ప.

స్వరాజ్యానికి సహనం పోయింది. పెద్ద యుద్ధమైపోయింది. నా బతుకు నేను బతుకుతానని – ఏలూరు వెళ్ళిపోయింది–

ఆకెళ్ళ కిష్టప్ప విషయాలేవీ వాళ్ళ వాళ్ళు పట్టించుకోని కారణంగా మొదటి నుంచీ మామగారే మంచి చెడ్డలు చూస్తున్నాడు.

కిష్టప్పని కలిసి ''ఏమిటీ అల్లరి?'' – అని ఆయన నిలదీశాడు. నువ్వెంతంటే వరకూ వెళ్ళింది వ్యవహారం–

అంతటితో ఆ సంసారం ముక్కలైంది.


తనూ, స్వరాజ్యం విడిగా ఉండడానికి నిర్ణయం జరిగినప్పుడే, తన మావ గారు ఉద్యోగం తీయించేశాడు. తను పీడా వదిలిందనుకున్నాడు.

వన్‌టౌన్‌లో మాజేటి వీరన్నగారిల్లు ఖాళీచేసి, గాంధీనగరం వైపువచ్చి మకాం పెట్టాడు. ఒక్కడు. మూడు గదుల చిన్న పెంకుటింట్లో – వాటా –

మాజేటి వీరన్నగారు, ''భార్య వదిలేసి వెళ్ళిపోయిన'' ఇతగాడి అవస్థ చూసి, జాలిపడి, రామినేని వారి సినిమాల పంపిణీ కంపెనీలో – ఫిలిం రిప్రజంటేటివ్‌గా ఉద్యోగం ఇప్పించారు. ఏ బాదరీ బందీలేని మనిషి గనుక, ఆ ఉద్యోగంలో ఊళ్ళు పట్టుకు తిరుగుతూండే వాడు. నాటకాల వ్యాపకం తగ్గించుకోకతప్పలేదు. సినిమా లలో, కనీసం ''యంగర్ బ్రదర్'' వేషాలైనా వెయ్యాలనే కోరిక వున్నా, రామినేని వారు ప్రోత్స హించలేదని అసంతృప్తి మిగిలింది–

***

చరిత్ర ఇలా నడుస్తుండగా గాంధీనగరంలో ఒక టిఫిన్ సెంటర్ అనబడే ''హొటేలు'' వెలిసింది. ఎదుటివైపు విశాలమైన డాబా గది. వెనక భాగం సిమెంటు రేకుల వసారా – అక్కడ వంటలూ వార్పులు జరిగితే, డాబా గదిలో వడ్డింపులు. కొద్దిరోజులు బుజ్జమ్మ హొటేలు అని పిలిచినా రాను రాను రెండేళ్ల తిరిగేసరికి ''వది నెగారి హొటేలు''గా కీర్తి సంతరించుకుంది.




ఇడ్లీ, మినపట్లు అక్కడ ప్రసిద్ధి – తెల్లవారి ఆరు గంటల లగాయతు పదింటి వరకు; మళ్ళీ మధ్యాహ్నం నాలుగు మొదలు ఎనిమిది గంటల వరకు–

వొదినె లేపాక్షిలో పద్మినీ విగ్రహంలాగ నల్లగా నునుపుదేరి జబర్‌దస్తుగా వుండేది. కళ్ళెత్తితే సాలు కనకాభిసేకాలే!–

చూపుతో, ఈవిడ ''ట్రాఫిక్కు'' కంట్రోలు చెయ్యగలదయ్యా – అని చెప్పుకొనే వారు.

అప్పట్లో సినిమా పంపిణీ కంపెనీల వారు అక్కడ నుంచే టిఫిన్ పార్సెళ్ళు తెప్పించుకునే వారు.

మరో రెండేళ్ళు గడిచేసరికి బెజవాడ జనం కార్తీకస్నానాల క్కూడా కృష్ణా నదికి వెళ్ళడం మానేసి వొదినె హొటేలు వైపు మళ్ళడం నేర్చుకున్నారు.

వొదినె అందరితో చనువుగా మాట్లాడేది – వీరుడి చేతిలో డాలు మాది రిగా ఆ హొటేలు ముంగిట్లో కిళ్ళీ కొట్టు వుండేది. ఆ కొట్టు మీద మండ పేట రాఘవ కూర్చు నేవాడు. రాఘవ ఇలాకా వొదినె అని చాలామంది భావించారు గాని – ఆవిడ అజ మాయిషీలో మనిషతడని రాఘవకి మాత్రమే తెలుసు–

బుజ్జమ్మ, ఏ అరమరికలు లేకుండా – ''మేం భోగాలవండి'' అని తన కులం చెప్పేది. ఎవరు ఏ కులమో, అడిగి తెలుసుకునేది. ఎవరైనా మందలించబోతే – ''తప్పేంటంట? నీకు బయవా? చెప్పకు!'' అంటూ ఎదురు నడిచేది!–

తనతో 'చనువు' చూపించే వాళ్ళ చహరా కనిపెట్టడంలో ఆమె దిట్ట.

***

ప్రధాన జీవిత స్రవంతిలో భాగంగా ఆకెళ్ళ కిష్టప్ప వొదిన హొటేలుకి అలవాటు పడ్డాడు. పూర్వాశ్రమంలో మండపేట రాఘవ, నాటకాలకు వయొలిన్ వాదకుడు కనక – ఆకెళ్ల కిష్టప్ప అక్కడ బాగా చనువైపోయాడు. అతను మంచి రంగైన వాడు, స్ఫురద్రూపి కావడంతో వొదినె కూడా ముచ్చట పడింది.

ఆ యీ నేపథ్యంలో – ఏలూరులో స్వరాజ్యం బతుకుతున్న నాటి ఒకటి రెండు ఘటనలు చెప్పుకోవలసి వున్నాయి. స్వరాజ్యం హిందీ పండితు రాలిగా ఒక స్కూల్లో ఉద్యోగంలో చేరింది. కూతురి మీద దిగులుతో అనారోగ్యంతో, తండ్రి చని పోయాక, తల్లిని పెట్టుకొని ఒక్కర్తే నిదానంగా జీవితం గడుపుతోంది.

కిష్టప్ప మధ్యమధ్య ఒకటి రెండుసార్లు వచ్చి, స్నేహం, వాత్సల్యం, నెరప బోతే ముభావంగా తిరస్కరించింది.

పౌరుషపడి – తనకి ఆమె అవసరం ఎంతగా వున్నా – బెజవాడ వెళ్ళి పోయాడు. ఎవరికీ చెప్పుకోలేని దిగులూ, న్యూనత మనస్సును పీకుతూండేవి. ఇన్నాళ్ళుగా విడిగా వున్న ఇది ఎవడితోటి తిరక్కుండా వుంటుందా? అనీ – నన్ను తోసిపారేసిందే అనీ – అనుమానం, మంట మాత్రం వదలడం లేదు.

అది చెడిపోతే బాగుండునని రహస్య ఆనందం – అప్పుడు పశ్చాత్తాపంతో తన కాళ్ళమీద పడితే – అనుగ్రహించాలని కల!

ఒకసారి రాజమండ్రీ పుష్కరాలకని వెడితే స్వరాజ్యానికి గోదావరి ఒడ్డున అంబుజవల్లి కనిపించింది! ఏలూరులో తన చిన్ననాటి స్నేహితురాలు! అయిదో ఫారం వరకూ ఇద్దరూ కలిసి చదువుకున్నారు.

స్వరాజ్యానికి కిష్టప్పతో పెళ్లైన ఏడే అంబుజవల్లి రాజమండ్రి వెళ్ళి పోయింది. అయిదేళ్ళ పైనే గడిచిపోయింది.

ఇన్నాళ్లకి కలిశామనుకున్నారు! చిత్రాంగి మేడ గోడ మీద కూర్చుని – ఒకళ్ళ సంగతులొకళ్లు చెప్పుకున్నారు.

స్వరాజ్యం చెప్పిన సంగతులు, సమస్యలు కొంతవరకే అంబుజవల్లికి అర్థమ య్యాయి. ఓదార్చింది. ధైర్యం చెప్పింది. ఒంటరిగా వుంటే నీ బోటి దానికి సమస్యే! వీలైతే కలిసి కిష్టప్పతో వుంటేనే మంచిదని సూచించింది. కాకపోతే మరొక పెళ్ళి!–

'ఛీ' అంది స్వరాజ్యం.

అంబుజవల్లి చిన్నప్పుడు ఎవరైనా అడిగితే ఏ అరమరికలు లేకుండా, ''మేం భోగాలవండి''– అనేది. ఇప్పటికీ అదే ధోరణి – తనొక డాక్టరు గారి 'ఆడా'లో వున్నానని చెప్పింది. నివ్వెరపోయింది స్వరాజ్యం.

ఆ తరువాత ఒకటి రెండుసార్లు ఏలూరు వచ్చింది. ఇంటికి కూడా వచ్చి స్వరాజ్యం తల్లిని పలకరించింది – ''శేషాలు కూతురివి కదటే'' అని ఆవిడ వాళ్ళమ్మ యోగ్యత పొగిడింది.

బెజవాడలో సినిమా హాల్లో ఒకతనితో కనిపించినప్పుడు మెల్లగా – ''మీ డాక్టరు గారా?'' అని అడిగింది. అంబుజవల్లి తమాషాగా నవ్వి – ''కాదు'' – అని

గుంభనంగా వెళ్ళిపోయింది.

ఇంకొకసారి ప్రత్యేకంగా పని గట్టుకుని ఏలూరు వచ్చి మాట్లాడింది. తనిప్పుడు స్వతంత్రంగా బెజవాడలో 'హొటేలు' నడుపుతున్నాననీ, మండ పేట రాఘవని పెళ్ళి చేసుకున్నాననీ, చెప్పింది–

తనని చేరదీసిన డాక్టరు మెల్లమెల్లగా తన మీది ప్రణయాన్ని సొమ్ము చేసుకుని – నగలు కాజేసి వెళ్ళిపోయాడట. ఆ తరువాత అంబుజమ్మ అయి, బుజ్జమ్మ అయి – మళ్ళీ కూడదీసుకుని ఒడ్డున పడిందట – మంచో చెడ్డో మొగుడిని చేరడం మేలు. మోసపోవడం పెళ్ళి కంటే ఘోరం – 'ప్రేమ' దొరికితే మంచిదే – దొరకడం లాటరీ – జానేదేవ్ – వయస్సు వచ్చే కొద్దీ మనశ్శాంతి ముఖ్యం అని తేల్చింది. స్వరాజ్యాన్ని ఒకసారి బెజవాడ రమ్మంది. తను "చూద్దాంలే" అంది నిరాసక్తంగా –

ఆకెళ్ల కిష్టప్పకి గొప్ప కాలక్షేపం దొరికింది. 'హొటేలు' మూసేశాక, క్లీ్ల కొట్టు వెనుక వసారాలో కుర్రాళ్ళు జేరి కేరమ్సు ఆడుతుంటారు. ఈ "సరదా" మాటున బుజ్జమ్మ "సంఘ వ్యతిరేకప్పనులు" చేయిస్తోందని – ఆమె అభివృద్ధి కిట్టని వాళ్ళు ప్రచారం చేశారు. ఏ విధమైన నిరూపణ జరగని కారణంగా పోలీసు వారు చర్యలు తీసుకోలేదు. కేరం బోర్డు అటని జూదంగా నడుపుతోందని మరొక ఆరోపణ –

ఆకెళ్ళ కిష్టప్ప వ్యవహారం, మండపేట రాఘవ బుజ్జమ్మకు చెప్పాడు.

ఆమె అవాక్కయిపోయింది!– స్వరాజ్యం!! ఎలాగైనా ఈ దంపతుల వ్యవహారం పొసిగే లాగ చెయ్యాలని బుజ్జమ్మ తహతహలాడింది.

***

బుజ్జమ్మ మండపేట రాఘవకి పతి పదవి కట్టబెట్టలేదు గనుక – ఆమె పతివ్రత కాదు – అందుకు న్యూనత పడలేదు.

ఆకెళ్ళ కిష్టప్పతో కథా కాలక్షేపాలు నెరిపినా, బుజ్జమ్మ అతనికీ పతి పదవి ఇవ్వలేదు –

ఇందుకు కారణం వుంది. అంబుజవల్లి తల్లి, ఒక సూక్తి నూరిపోసింది – అమ్మాయ్ – మొగవాడన్నవాడు, ఇంట్లో సరుకెత్తుకుపోయి పెంకుటింటి మీద కూర్చున్న కోతిలాంటోడు – గత్తర బిత్తర చేశావనుకో, పెంకులు పీకి కొంపగల్లం తుసేస్తడు. అందుకని లాలించి బెల్లించి సరుకు లాక్కోవాలి గాని, 'సను'ం కూడా ఇవ్వకూడదు, ఇచ్చావో, పోతావు సుమా!– ఆ తల్లి 'సరుకు' అంటే బంగారం అని వివరణ కూడా చెప్పింది. జీవితంలో ముందుకెళ్లే కొద్దీ, తల్లి 'జ్ఞాని' అని అర్థమైంది.

అంబుజవల్లి, డాక్టరు గారి ప్రణయానికి గుర్తై, తప్పటడుగులు వేయడం వల్ల సర్వం కోల్పోయి బుజ్జమ్మగా మిగిలినప్పుడు, మండపేట రాఘవ సాయం తీసుకోవలసి వచ్చిప్పుడు, మరింక చలించడం మానేసింది.

ఆకెళ్ళ కిష్టప్ప పెళ్ళాం తన స్నేహితురాలు కావడం వల్ల – ఈ మగ మనిషి స్వరాజ్యానికి కష్టం కలిగించడం వల్ల – అట్టివాడు తన ఇలాకా లోకి రావడం వల్ల – స్వరాజ్యానికి ఉపకారం చేద్దామని – బుజ్జమ్మ నిజంగా వొదిన పాత్ర ధరించింది. ఆకెళ్ళ కిష్టప్ప దగ్గరగా కూర్చొని–

"యావయ్యోవ్, ఇటుచూడు. కట్టుకున్నది సాధించిందని నెపం పెట్టావు. ఇంటికాడ తోచుబాటు లేక సినిమాకు పోతే, ఆడెవడో టిక్కెట్టు తీసి పెడితే రంకు కట్టేవే; – నీ నీతేంటట? – అర్ధరాత్రి అపరాత్రి తిరగ లేదా, తాగలేదా – నాటకాల పిల్లల్తో సరసాలాడ లేదా – చాల్చాలింక; అయిందేదో అయింది; తెమ్చుకో –"

"ఇది మరీ బాగుంది. వెళ్ళిపోయిందదీ; ఏ నీడ చూసుకు వెళ్లిందో – ఉండనీ"–

"మేం భోగాలం; నీకు నీతులు చెప్పే పని నాకేంటి? – స్వరాజ్యం అమాయకం మాలోకం – నేనెందుకు చెప్పానో చెయ్యి"

"నువ్వు ఇదవుతున్నావు గనక చూద్దాంలే"

"నన్ను నమ్ముకోవద్దయ్యోవ్! – ఇరికించకు – నీ ఇష్టం వచ్చింది చేసుకో – కడ కాలం వస్తే ఉడకేసి పెట్టే మనిషి వుంటుందని చెప్పాను"–

ఆకెళ్ళ కిష్టప్ప అలిగి వెళ్ళిపోయాడు. ఈ సంగతి జరిగిన రెండు నెలలకి ఆకెళ్ల కిష్టప్పకి ఘోరప్రమాదం జరిగింది. అయితే ప్రాణాలతో బయట పడ్డాడు. ఆస్పత్రిలో నాలుగు నెలల వైద్యం జరిగింది.

మద్రాసు నుంచి నెల్లూరు వస్తూ, తొందరపడి, నడిచే రైలులోంచి ప్లాట్ ఫారం మీదకి దూకినట్టు దిగాడు. కాలు పట్టు తప్పింది. అదృష్టవశాత్తూ విసిరేసినట్టు దూరంగా పడ్డాడు. వెన్నెముక దెబ్బతింది.

రామినేని వారి కంపెనీ వారే వైద్యం చేయించారు. మండపేట రాఘవ, వొదినె అప్పట్లో ఆదుకుని కష్టకాలాన్ని కాశారు.

## కథాంతరంగం



ఈ కథ నేను ఎందుకు రాశానంటే...విజయవాడలో నేను రేడియోలో పనిచేసేటప్పుడు మా ఆఫీసుకు దగ్గరగా ఓ టిఫిన్ సెంటర్ ఉండేది. అక్కడ మినపట్లు, కాఫీ అద్భుతంగా ఉండేవి. ఈ సెంటర్‌ని ముప్పయి–ముప్పయి నాలుగేళ్ళ వయసున్న ఓ స్త్రీ నడుపుతుండేది. అందగత్తె కాదుగాని అందర్నీ బాగా ఆకర్షించేదామె. అంతా ఆమెను 'వదిన' అని పిలిచేవారు. కుర్రాళ్ళు ఆ టిఫిన్ సెంటర్ వెనుక క్యారమ్స్ ఆడేవారు. ఆటలో గొడవలు పడేవారు. గొడవలు పడితే ఒప్పుకునేది కాదామె. ఇరు వర్గాలనీ కసిరి, తిట్టి కూర్చోబెట్టేది.'గోల పడకండి! సరదాగా ఆడుకోండి! ఏరా తమ్ముడు! ఏరా మామా' అని కలుపుగోలుగా అందరితో కబుర్లాడేది. యువకులు మితిమీరి ప్రవర్తిస్తే 'తప్పురా' అని తప్పించుకునేది. వారి బలహీనతలను నవ్వుతూ క్షమించేది. కష్టాల్లో ఉంటే కాణీ పరకా ఇచ్చి ఆదుకునేది. 'వదిన అదో టైప్! చాలా గొప్పది' అనేవారంతా. ఇదంతా నాకు కథ రాయాలనిపించేది. అనిపించినా ఆరేడేళ్ళు రాయలేకపోయాను. ఇటీవలే 2007లో రాశాను. రాసి చదువుకుంటే...నేనింకా రేడియోలో పని చేస్తున్నట్టుగానే అనిపించి ఆనందించాను.

– ఇంద్రగంటి శ్రీకాంతశర్మ

ఫోన్: 040–27794073

బుజ్జమ్మ చివరి హెచ్చరికగా స్వరాజ్యానికి క్షమాపణ చెప్పుకుని, కాపరం నిలబెట్టుకోమని ఆకెళ్ళ కిష్టప్పకి చెప్పింది.

అవసరం తనది. అతను లొంగి వచ్చాడు. అయితే–

బుజ్జమ్మ సంకల్పం నెరవేరేలోగా వొదిన వొటేలు సర్వనాశనమై పోయింది. కిట్టని వాళ్ళ పంతం నెగ్గింది – కేరం బోర్డు జూదం రుజు వైంది. పోలీసులు 'రైడ్' చేశారు. దురదృష్టం ఎదురొచ్చి – ఆ రోజే బుజ్జమ్మ ఇంటికొచ్చిన స్వరాజ్యాన్ని కూడా ఆమెతో పాటు పోలీసులు పట్టుకుపోయారు.

చచ్చి చాయంగల విన్నపాలై పోయి, రామినేని వారి పలుకుబడి వల్ల బుజ్జమ్మ, స్వరాజ్యం బయట పడ్డారు.

బుజ్జమ్మ తన గురించి కంటే స్వరాజ్యం కోసం ఏడిచింది – ఉపకారానికి పోతే, అపకారం ఎదురైంది.

అవమానం భరించలేక, స్వరాజ్యం ఎలకల మందు తినేసింది – చచ్చిపోయింది.

వొదిన వోటలు మూతపడింది. బుజ్జమ్మ ఆకెళ్ళ కిష్టప్పని దగ్గరుండి ఏలూరు తీసికెళ్ళి స్వరాజ్యానికి కర్మ చేయించింది. చితి ఉన్న చోట ఏమీ లేదు.

ఇంకా ఆకెళ్ల కిష్టప్ప మనస్సులో, స్వరాజ్య వ్యభిచార పరిహార మంత్రాలు మాసిపోలేదు.

అంబుజవల్లి స్నేహితురాలు కదా స్వరాజ్యం! ఈ బుజ్జమ్మ గాలి తగిలి, సాదాగా ఎలా వుంటుంది?

మరయితే ఎందుకు కర్మ చేసినట్టు? కేవలం అంబుజవల్లి మీద వున్న ఇష్టం వల్ల–

అంటే–

ఎవరు వ్యభిచరించినట్టు? అన్నాళ్ళు వంటరిగా వున్న స్వరాజ్యం నిగ్రహంతో వున్నట్టేనా?–

ఆకెళ్ళ కిష్టప్ప అనుమానం ఈ జన్మకి తీరేది కాదు–

మండపేట రాఘవ చెయ్యందిస్తే, అందుకుని బుజ్జమ్మ బస్సులో కెక్కింది. అంబుజవల్లికి పాతివ్రత్యం ఉన్నట్టా? లేనట్టా?

వొదిన, వ్రతం చెడ్డ పతివ్రత అనుకున్నాడు – అణుకువ గల భార్య కోసం, మళ్ళీ పెళ్ళికి సిద్ధంగా వున్నాడు ఆకెళ్ళ కిష్టప్ప.

*